ముగింపు మీకు తెలుసు

నేనూ ఆమె చిన్నప్పుడు ఒక కళాశాలలో చదువుకున్నాం. పదిహేనేళ్ళ తరువాత భర్తతో కాపరం చేస్తుంటగా మళ్ళా ఆమెను చూడడం జరిగింది. చిన్నప్పటి స్నేహితులు, చదువు, కళాశాలలో ఉపాధ్యాయులు—ఇవన్నీ ముచ్చటించుకుంటూ, వార్షికోత్సవ సందర్భంలో తరగతి విద్యార్థులందరూ కలిసి తీయించుకున్న ఫోటో ఒకటి తీసి, అందులోని వ్యక్తులు ఎవరెవరు ఏంచేస్తున్నదీ, ఎక్కడెక్కడున్నదీ ఆరాలుతీసి స్మరించుకుంటున్నాం. మూలగా నిలబడ్డ ఓ వ్యక్తికేసి చూపించి, "పాపం మురళి ఎక్కడున్నాడో!" అన్నదామె. మురళెవరు ?" వెంటనే స్ఫురణకు రాలేదు. "పావలా ఫ్లూట్ మీద గానం చేస్తుండేవాడట హాస్టల్లో-తెలీదు ?" అని అందిచ్చింది. జ్ఞాపకం ఒచ్చింది. అతన్ని "బాల" అనేవాళ్ళం. వేణువాద్యమే కాకుండా, భావ గీతాలు కూడా వ్రాస్తుండేవాడు. "ఎక్కడున్నాడో ?"

"ఏమో, నాకూ తెలీదు. అతన్ని మళ్ళా ఎప్పుడూ కలుసుకోడం జరగలేదు" అన్నాను. అక్కడినుంచి ఒచ్చేసిం తర్వాత "బాలు"ని గురించిన కుతూహలం హెచ్చింది. "పాపం మురళి ఎక్కడున్నాడో ?" అన్నదామె. ఆ "పాపం" ఎందుకు ? "బాలు" ఇప్పుడెక్కడున్నదీ, ఏం చేస్తున్నదీ తెలుసుకోవాలని అన్వేషణ సాగించాను. ఎంద రెందరికో వ్రాశాను. ఆరాలు తీశాను. నా యత్నాలు ఫలించాయి. "బాలు"ను గురించి తెలుసుకున్నాను...

"ఎవరో నువ్వు చెప్పనక్కర్లేదు. నాకూ తెలుసు" అన్నాడు మిత్రుడు శాస్త్రి.

"చెప్పు చూద్దాం" అన్నాను.

ఫలానా అని చెప్పేశాడు శాస్త్రి. ఆశ్చర్యపడ్డాను. సత్యాన్వేష

కుడు సాధించే దారుణ ఫలితాలలో సత్యాన్ని తెలుసుకోడం ఒకటి కాబోలు ననుకున్నాను.

నిజంగా జరిగిన ఒక సంఘటన ఆధారంగా ఒక కథ వ్రాద్దామని సంకల్పించి, ఆ వృదంతం మిత్రుడు శాస్త్రికి చెప్పి చూశాను. కథ ముగింపు ఆశ్చర్యం గొల్పేదిగా వుండాలంటారు విమర్శకులు. ముగింపు యిట్టే చెప్పేశాడు శాస్త్రి. ఇంక నేను కథ వ్రాయడం దేనికి ?

ఆధునిక సాహిత్యం వింతమార్గాలు తొక్కి ఎందుకు విపరీతమైన ధోరణులు వ్యక్తం చేస్తోందో కొంచెం అర్థమవుతూంది. నూతనమైన వస్తువు దొరకదు. ప్రతి విషయం గురించీ, పెద్దలు యిదివరలో వ్రాసే వున్నారు. చేప్పేతీరులో, "శిల్పం"లో నిశిష్టత కనపర్చాలి. ఈ కస రత్తంతా దీని ఫలితమేమో ననిపిస్తుంది. దీర్ఘ సమాసాసనం, కామాల వైక్లబ్యం, చుక్కల పందెం, బ్రాకెట్ల మేళవింపు, గద్యకవితల ముష్టియుద్ధం, వికృత ప్రయోగా లనబడే నిప్పుల చక్రాల గుండా దూకుళ్ళు—యివన్నీ ఆధునిక సాహిత్య తాలింఖానాలలోని కొన్ని వింతలు. మిత్రుడు శాస్త్రి కూడా నాతో ఏకీభవించాడు. అతన్ని గురించి వ్రాస్తూ 'హెమింగ్‌వే ప్రభావం ఈయిన మీద బాగా కనిపిస్తోందే' అన్నాడట వొక విమర్శకుడు. శాస్త్రి గోల. అతనెప్పుడూ, హెమింగ్ వే రచన వొక్కటి కూడా పూర్తిగా చదువలేదు. చదవలేదు మొర్రో అంటే నమ్మే వాళ్ళెవళ్ళంటారు. 'ఇందులో పాత్రలన్నీ కల్పితాలు' అంటాడు రచయిత. చాలా భాగం కల్పనా సాహిత్యంలో రసవత్తరమైనది. ముందు రచయిత చెప్పిన యీ వొక్క వాక్యమేమో ననిపిస్తుంది.

అంత మాత్రంచేత, భయపడిపోయి కథా రచన విరమించ వల్సిందే! శాస్త్రి వొక రచయిత, విమర్శకుడు. రచనకు అతను ఆపాదించే విలువలు వేరు, సామాన్య పాఠకుడు కోరే ఆనందం వేరు. ముగింపు తెలిసిపోయినంత మాత్రాన కథ కుంటుపడు తుందనుకోనక్కర్లేదు. ఈనాడు అపరాధ పరిశోధక నవల చాలా ప్రచారంలోవుంది. పాశ్చాత్య

దేశాలలో దాసికున్న పలుకుబడి, ప్రచారం మరేయితర రకం రచనకీ లేవనొచ్చు. వీటిల్లో చాలా భాగం హంతకుడెవడో తెలుసుకోవడంలో పాఠకుడికి వినోదం, తాత్వికోల్లాసం సమకూరుస్తాయి. మరో రకం డిటెక్టివ్ నవలలో, హంతకు డెవడో మనకి ముందే తెలిసి పోతుంది. అసలు కథంతా హంతకుడే చెప్పేస్తాడు. కాని అతనట్లా ఎందుకు చెయ్యాల్సి వొచ్చింది – ఏ విధంగా చేశాడు —— అతని మనస్తత్వము ఏ విధంగా అల్లా ఏర్పడింది – కారణాలు, అవకాశం, అవలంబించిన విధానం – వీటిని చర్చించడం, ఈ రకం నవల వుద్దేశం. వీటిపట్ల కుతూహలం పాఠకుడిలో ఎప్పుడూ వుంటుంది. పాఠకుడి యీ కుతూహలాన్ని తృప్తి పరచే వుద్దేశంతో ఈ రచన సాగించడంలో ఆక్షేపణ వుండదనుకుంటా.

ఆటవికశాఖ వారు జంతువులచర్మాలు వేలంపాడుతున్నారని తెలిసి మా వూళ్ళో చౌదరిగారు – వొక ధనికుడు – పులిచర్మాలు తీసుకు రమ్మని పంపితే ఆ వూరెళ్ళాను. ఆటవిక శాఖాధికారి నౌకరొచ్చి, వారి బంగళాకి తీసుకెళ్ళాడు. అధికారిగారి పేరుమూర్తి. స్నానం చేస్తున్నారు, అల్లా కుర్చీలో కూర్చోమన్నారు. గోడలకేసి చూస్తూ వరండాలో పచార్లు చేస్తున్నాను. గోడలన్నీ అడవి మృగాల తలలు – కొమ్ములు, కోరలు, చర్మాలు - అమర్చబడి వున్నాయి. ఆటవిక శాఖాధికారి కూడా కాస్తో కూస్తో భయంకరంగా వుంటాడని నా వూహ. నిజంగా మూర్తి అల్లాగే వున్నాడు. చూడగానే ఏ ఉత్తరదేశపాయనో అనుకున్నా. దగ్గర దగ్గరగా ఆరడుగుల ఎత్తు – అంత ఎత్తుగా వుంటే గాని ఆ శాఖలో ఉద్యోగం దొరకదు కాబోలు – కొంచెం నలుపు. నల్లగుడ్డు చుట్టూ తెలుపు ‘జీర’, రంధ్రాలు కనబడేట్లు వొంకర తిరిగిన ముక్కు. దట్టమైన కనుబొమలు, తాంబూలం వల్లో పొగాకు వల్లో అక్కడక్కడ డాగైన పళ్ళు, పై పెదవిని కప్పిన మీసం, చదరంగా కత్తిరించబడిన తెల్లవెంట్రుకలతో వైవిధ్యాన్ని తెచ్చుకున్న గడ్డం – అది ఆయన వైఖరి. దాగానే కరస్పర్శ

చేశాడు. నలిగిన వేళ్ళని సరిచేసుకుంటూ కూర్చున్నా. తొందర పనిమీద జీపులో వెళ్ళాలిట – వోగంటలో వొచ్చేస్తాను. ఈలోగా అసిస్టెంట్లు చర్మాలన్నీ తనిఖీ నిమిత్తమై ప్రదర్శిస్తారు, వాటిని చూస్తూ వుండమని చెప్పి, అమ్మగారితో టిఫిన్ విషయం చెప్పవలసిందిగా నౌకర్‌తో మాట్లాడాడు. అటూ యిటూ చూసి లోపలికెళ్ళి నౌక తోలు హంటర్ తీసుకొచ్చాడు.

'ఇది అడవి పంది చర్మం' అని హంటర్ చూపించాడు. 'మొన్ననే వేటాడాం,' ఏమనాలో తెలిసింది కాదు. హంటర్ తిప్పుకుంటూ జీపులో ఎక్కాడు. టోపిగాడక దగ్గినట్లుగా, జీపు నానా భీభత్సం చేసి నిష్క్రమించింది.

ముందుగదిలో బల్లమీద కొన్ని పత్రికలు కనిపించాయి. కాలక్షేపానికి ఏదేనా పత్రిక తీద్దామని లోపలి కెళ్ళాను. పత్రికలతోపాటు ఏవో కవర్లు కూడా వున్నాయి. వొకటి నే చదువుకున్న కళాశాల పాత విద్యార్థుల సమావేశానికి రావల్సిందిగా పంపిన ఆహ్వాన పత్రం. కవరు మీద శ్రీమతి సీతాదేవి అని వ్రాసి వుంది. సీతాదేవి ఎవరు ? మూర్తిగారి చెల్లెలా ? కూతురా ?

నౌకరు టిఫిన్ సరంజాం బల్ల మీద పెట్టిన చప్పుడైంది. వెనక్కి తిరిగాను. ఆమె కనబడింది. చటుక్కున ఆమె లోపలి కెళ్ళిపోయింది. ఆ వొక్క క్షణంలోనూ ఆమెను పూర్తిగా చూశాననేచెప్పాలి. మొహం అంతా ఆవరించే పెద్ద కళ్ళు. ఎండి ఆనందంతో విడిపోయిన దానిమ్మను స్ఫురింపచేసే పళ్ళు, పమిట కొంగుని పాయిలుగా స్ఫుటంగా విడదీసిన ఎత్తయిన వక్షస్థలం—స్త్రీ కాబట్టి—ఇన్నింటినీ క్షణికమైన దృష్టి ఇముడ్చుకుంది.

ఇంతట్లోకి 'అసిస్టెంట్' వొచ్చాడు. అతని వెనకాల మరో యిద్దరు నౌకర్లు చర్మాల కట్టలని పట్టుకొచ్చారు. అసిస్టెంటు పొట్టిగా వున్నాడు. కొనవూపిరితో అక్కడక్కడ అంటిపెట్టుకొని వున్న వెంట్రుకల మధ్య

నిగ నిగ మెరిసే బట్టతల—అటవీశాఖలో ఉద్యోగాలని గురించి నే అను కున్నది తప్పని ప్రత్యక్షంగా ఋజువు చేస్తున్నాడీ వ్యక్తి. జింక, దుప్పి, సివంగి – వీట్ల చర్మాలు చూపిస్తున్నాడు. నాక్కావల్సింది పులి చర్మం. అవి దూరంగా వున్న కాంప్ షెడ్‌లో వున్నాయట. తీసుకొస్తానని వెళ్ళాడు.

ఆమె మళ్ళా మధ్య గది కిటికీలోంచి చూసింది. నేను మళ్ళా ఆమె కేసి చూశాను. కళ్ళు అంత మరీ పెద్దవి కావు – పళ్ళు దానిమ్మని స్ఫురింపజేస్తున్నా అదింకా పచ్చిదానిమ్మే. ఆ చీర మతతలుపడే స్వభావం కలది గాని, రొమ్ములు మరీ అంత స్ఫుటమైనవీ, ఎత్తైనవీ కావు. ఈ సారి నా దృష్టిని ఎక్కువగా ఆకర్షించినది ఆమె ఎర్రటి పెదవులు. సంధ్యా సమయంలో పటమటాకాశంలో కమ్మిన నల్లమేఘాలని చీల్చిన కడసారి సూర్య కిరణంలా. గుమ్మంలో కొచ్చింది.

'చక్కెరైపోయింది. ఇక్కడ దొరకదు. బెల్లం కొంచెం వేశాను. మరి కొంచెం కావాలా ?'

పరాయి స్త్రీని పరీక్షగా చూడటం గూర్చి మనస్సు పీకుతున్నా, ఆమె నెక్కడో చూసినట్లుగా వుండడంవల్ల అల్లా చూసానేమో. ఆమె కూడా అందుకే అలా చూస్తోందేమో !

"మూర్తిగారు — మీకు —"

"మా వారే"

"వారు ఏ కాలేజీలో చదువు—"

నవ్వింది.

"నన్నింకా గుర్తుపట్టలేదా ?"

నేనూ నవ్వాను. ఇప్పుడు గుర్తుపట్టాను. ఆమెని సీతారామమ్మగా కళాశాలలో ఎరుగుదును. తాశీల్దారుగారమ్మాయి. పదునాలుగు, పదిహే నేండ్ల నాటి మాట. కళాశాల కల్లా ముగ్గురే విద్యార్థినులు; వొకామె క్రైస్తవ కన్య 'అన్నా'; మరొకామె 'జయంతి' – తండ్రి డాక్టరు;

వంగదేశస్థుడు. స్త్రీలు చదువుకోవాలనీ, వరుణ్ణి వారే ఎన్నుకోవాలనీ, కట్నాలూ అవీ యివ్వకూడదనీ, జిల్లా కలెక్టరుగారు వుపన్యాసాలిస్తూండే వాడట. ఆయన్ని తృప్తి పరచి, మెప్పు పొందడం కోసం తాశీల్దారు గారు సీతారామమ్మని కళాశాలలో సాహసం చేసి చేర్పించాడని ఆ రోజుల్లో వింతగా చెప్పుకునేవారు. అప్పుడు ఆమెకి పదిహేను పదహారేళ్ళుంటా యేమో. మాతో చదువుకున్నదే గాని నిజంగా ఆమెతో ఎప్పుడూ నేనింత వరకూ మాట్లాడలేదు — ఆమె కంఠం ఎట్లా వుంటుందో మాకు తెలీదు. తలొంచుకొని కూర్చొనేది. ఆమె అప్పుడెట్లా వుండేదీ నాకు జ్ఞాపకంలేదు సన్నగా వుండేది. సాధారణ ఛాయ. కను రెప్పలు తీర్చి దిద్దినట్లుగా, వొంపు తిరిగి, నీడలు పడుతున్నట్లుగా, అస్పష్టమైన వొక దృశ్యం మెదడులో మసలుతుంది — పొగమంచుతో నిండిన అద్దం లోంచి వర్షపు ధారలని చూసినట్లుగా. ఇప్పుడెంతో మారిపోయింది. కాలం కాఠిన్యాన్ని కవులంతా ఆడిపోశారంటే యిందుకే కాబోలు! యౌవ్వనంపై మమకారం కొద్దీ కండలు పెరిగి, సన్నటి శరీరాన్ని కప్పేసి కౌగిలించుకున్నాయి. అప్పుడే కళ్ళ కింద చర్మంపై గీతలు, మెరుపుల్లా మధ్య మధ్య తెల్ల వెంట్రుకలు — ఎర్రటి పెదవులను మినహాయించి నడివయస్సు స్థబ్దత ఆవహించేసింది.

'చాలా మారి పొయ్యాను కదూ' అందామె.

'నన్నెల్లా గుర్తుపట్టారు ?'

'పాత విద్యార్థుల సమావేశపు ఆహ్వానం నిన్ననే వొచ్చింది, సమావేశం జరిగిన వారానికి చేరింది ఈ ఆహ్వానం. పాత సామాను తిరగ వేస్తూంటే కళాశాల పత్రిక కనబడింది. అందులో మన బృందం ఫోటో వుంది. మీరూ వున్నారు, తీసుకొస్తా నుండండి' అని లోపలి కెళ్ళిందామె.

ఈ పదిహేనేళ్ళ లోనూ ఆమెలో కలిగిన మార్పు చూసిం తర్వాత నేనెంత మారిపోయుంటానో తల్చుకుని కాసేపు దిగులుపడ్డాను. యౌవనం ఎప్పుడు అస్తమించి నడివయస్సు స్థబ్దత ఎప్పుడు మీదపడుతుందో ఎవరి

మటుకు వారికి తెలీదు. బ్రహ్మచర్యం అవలంబించి, శరీర శక్తుల్ని ఖర్చు చెయ్యకుండా శ్రద్ధపరచుకుంటే యౌవనం మరికొంత కాలం నిలబడు తుందా? నిలబడదు. పైపెచ్చు అల్లా చేస్తే మరికొన్ని మానసిక జాడ్యాలు కూడా సంక్రమిస్తా యంటున్నారు మనస్తత్వ శాస్త్రజ్ఞులు. శరీరం మోటుగా ప్రవర్తిస్తుంది — యౌవనంలో పేట్రేగుతుంది. నడి వయస్సులో నిదానిస్తుంది. వార్ధక్యంలో శుష్కిస్తుంది. సంస్కృతి, తపస్సు, ఆధ్యాత్మికాన్వేషణ - యివేవీ ఈ మార్పుని ఆపుచెయ్యలేవు. ఇది గమనించే కాబోలు మార్క్సు మొదలైన మేధావులు ప్రపంచ చరిత్ర పునాదుల్ని మట్టిలోంచి పెల్లగించమంటున్నారు.

'ఇదిగో చూడండి' అని కళాశాల సంచికలో ఫోటో చూపింది. సంచికలో పుటలన్నీ తాకిడికి హెడ్డుంగా రాలిపోతున్నాయి. ఆ ముగ్గురు విద్యార్థినులలో మధ్య నున్నది ఆమె. వెనకాల నిలబడ్డ వారిలో రెండో వాణ్ణి నేను.

'మీ రేమిటి — అంత, అల్లాగైపోయారు?'

నేను భయపడ్డట్టుగానే ఆ కాస్త ప్రశ్నా అడిగేసింది. కాని, 'అంత లావు' — లాంటి కటువైన పదాలు వాడకుండా కనికరించింది. నాలో మార్పు హర్షించ తగిందా కాదా అని అడుగుదా మనుకున్నాను. కాని ధైర్యం చాల్లేదు.

రంగనాథం ఏం చేస్తున్నాడో?

రంగనాథం ఇంగ్లీషులో ఫస్టు. కాలేజీ పత్రికకి సబ్ ఎడిటర్, బి. ఏ. ఆఖరేడు. మేం ఇంటర్ మొదటి సంవత్సరం.

'రంగనాథం గూడ్స్ గార్డ్‌గా పని చేస్తున్నాడు. ఆ మధ్య పెరంబూర్‌లో కనిపించాడు' అన్నాను. షేక్స్‌పియర్ నాటకాలు బాగా చదివే వాడు. అతనంటే ఉపాధ్యాయులకి కూడా బెదురేనని చెప్పుకునేవారు. ఎక్కడ షేక్స్‌పియర్, ఎక్కడ గూడ్స్ గార్డ్! P. B. WN

'అన్నా, ఎక్కడుందో !'

'స్కూలు మాష్టరు.'

'జ్యోయ్ మొతిదేబీమాటో' అన్నా వంగభాషలో ఉచ్చరణ అనుకరిస్తూ.

'మెడిసన్ పూర్తి చేసి కలకత్తాలో డాక్టరుగా పని చేస్తోంది. అప్పుడే కళ్ళకి జోడు. ముగ్గురు సంతానం' అని ఆమె స్వేచ్ఛగా నవ్వేసింది. కళ్ళజోడుకి సంతానానికీ ఏం సంబంధమో తెలీక కాబోలు !

'ఇతను గోపాలం కాదు—? తెలుగు మాస్టార్ని అల్లరి ప్రశ్నలతో విసిగించేవాడు'.

'మీ కింకా జ్ఞాపక ముందే. ఇప్పుడెక్కడున్నాదో తెలీదు' అన్నాను.

'సరే – యిది మీరు – పులి చర్మాల కోసం ప్రస్తుతం యిక్కడున్నారు' అని నవ్వడం సాగించింది.

'కూర్చున్న వారిలో మధ్యనున్నది ప్రిన్సిపాల్, ఆయన సతీమణి. రిటైరయి యిప్పుడు అమెరికాలో వున్నాడు. ఆ రోజులు స్మరించుకుంటూ కాబోలు ఆమె మౌనంలో పడింది. నేను టిఫిన్ పూర్తి చేశాను.

'చూశారా – నేనూ పాత విద్యార్థినే, ఆహ్వానము మటుకులేదు. స్త్రీల కెల్లాగైనా ...'

ఒక మతిమరుపు జడ్జిగారిలా వుంది నా ధోరణి. ఆయన భార్య ఏవో ప్రశ్న లడుగుతూ వుండేదట. వాటిల్లో ఏదో వొక దానికి సందర్భం లేకుండా నాలుగైదు రోజు లయ్యాక సమాధానం చెప్పేవాడుట. ఒకరోజు ఉదయం 'ఏమీ లేదు, పిల్లలే' అన్నాడుట. రెండు రోజుల క్రితం 'ఆ చప్పుడేమిటండీ ?' అని ఆమె అడిగిన ప్రశ్నకి సమాధానమని వారం తర్వాత ఆవిడకి స్ఫురించిందట.

నన్ను వాక్యం పూర్తి చెయ్యకుండానే సీతాదేవి అంది.

'మీకూ ఆహ్వానం వొచ్చే వుంటుంది. వెనకటి అడ్రసుకి పంపి

వుంటారు. అనేక అడ్రస్‌లు మారి నాకు చేరినట్లుగా మీకూ ఎక్కడికో వెళ్ళే వుంటుంది. అయినా మనం వెళ్ళడం జరుగదుగా.'

అది నిజమే. కాని ఆహ్వానం రాలేదంటే కొంచెం చిన్నతనంగా వుంటుంది.

'నా కొచ్చిన కవర్‌మీద అడ్రస్ చూశారా? మా వారిపేరు టి. కె. మూర్తి అనుంది. వి. కె. మూర్తి అనుండాలి. అందుకనే మావారి కది చూపలేదు. తప్పుపేరిట ఆహ్వానం అందుకోడంబదులు, అసలు రాక పోవడమే మెరుగనుకున్నా—పేరుగాని, ఇంటిపేరుగాని కవరుమీద, కార్డు మీద సరిగ్గా వుండకపోతే బాధగా వుంటుంది. డర్బీస్వీప్‌లో మనకో లక్ష రూపాయ లొచ్చిందన్న వార్త తెలియజేసే ఉత్తరమైనా పేరు సరిగ్గా లేకపోతే చిన్నబుచ్చుకోవడంమాత్రం తప్పదు.

నౌకర్‌తో టిఫిన్ సరంజాం తీసెయ్యమని సంజ్ఞ చేసింది. నేను లేవబోతుంటే, ఆ ఫొటోలో వెనక నిలబడ్డ వారిలో మూలగావున్న వ్యక్తి కేసి చూపించి 'పాపం, మురళి ఎక్కడున్నాడో?' అన్నదామె. మురళెవరు? వెంటనే స్ఫురణకురాలేదు. ప్రశ్నార్థకంగా మొహంచిట్లించాను. "పావలా ఫ్లూట్‌మీద గానంచేస్తుండేవాడట హాస్టల్లో-తెలీదూ?" అని అందిచ్చింది. జ్ఞాపకంవచ్చింది అతన్ని 'బాలు' అనేవాళ్ళు. బాల కృష్ణ, మరోతరగతి వాడవడంవల్ల మాతో కూర్చునేవాడు కాదు. మా అందరికీ వారానికోసారి ప్రిన్సిపాల్‌గారి పాఠం వుండేది. అప్పుడే కలుసు కునే వాళ్ళం. హాస్టల్లోకూడా వాళ్ళవి మేడమీద గదులు, మావి కింద. ఒక ముస్లిమ్ రోజూ హాస్టల్ ముందు ఫ్లూట్ వాయిస్తుండేవాడు. ఫ్లూట్ అమ్ముతుండేవాడు కూడా. 'బాలు' ఒక ఫ్లూట్‌కొని, ఎవళ్ళూ లేనప్పుడు ఏదో మూలగా వెళ్ళి వాయించుకుంటూవుండేవాడట. ఎంతవరకు అభ్యసించాడో, ఎల్లావాయించేవాడో నాకు తెలీదు. అతనికి ఎవళ్ళూ పెన్సిల్ మటుకు యిచ్చేవాళ్ళు కారు-దాన్ని నోట్లో పెట్టుకుని కొరకడమో, ఊదడమో చేసాడని భయ్యం అంటూ వేళాకోళం చెయ్యడం నాకు గుర్తు.

అతను తెలుగులో మంచి మార్కులు తెచ్చుకునేవాడు. సంస్కృతంకూడా చదువుకునేవాడు. మా తెలుగు పండితులకి అతనంటె చాలా ఇష్టం. కాని ఆ రోజుల్లో తెనుగుకి అంత పరపతి లేకపోవడంవల్ల యితన్ని వో ముఖ్యుడుగా ఎవరూ పరిగణించారనుకోను.

'ఎక్కడున్నాడో ఏమో నాకు తెలీదు. అతన్ని మళ్ళా ఎప్పుడూ కలుసుకోడం జరగలేదు' అన్నాను.

ఇంతలో అసిస్టెంట్ వచ్చాడు. పులి చర్మాలని ఇక్కడికి తేవడం కష్టం. టెంట్ దగ్గరకే ఒచ్చి చూచుకోమన్నాడు. సరేనని లేచాను.

"జాలస్యని, జేమ్స్ని తీసుకురమ్మనండి" అన్నది సీతాదేవి. అసిస్టెంట్ సరేనని వెళ్ళాడు. ఆవిడ బల్లమీద ఉత్తరాలు, పుస్తకాలు, పత్రికలు, సంచిక అన్నీ తీసుకుని లోపలి కెళ్ళింది. నౌకరు టేబిల్‌పై గుడ్డతీసి దులిపాడు. నేను కాస్త దూరంలో ఉన్న తేనిపట్టుని చూస్తూ కూర్చున్నా. పదినిమిషాల్లో మరోచీరకట్టుకుని ఆమెవచ్చి, 'రండి-ఇల్లు చూద్దురుగాని' అని ఆహ్వానించింది. అది తిరువనంతపురం చీర – వెడల్పు జరీ, పల్చగా, తెల్లగా, నాజూకుగా వుంది. ఉదారంగు జాకెట్టు కనిపిస్తోంది. పదిరాళ్ళతో పొదిగిన నెక్లెస్ మెడని చుట్టుకుంది. తెల్లరాళ్ళ దుద్దులు— మధ్య ఎర్రరాయి మెరుస్తోంది. ఆవిడ వేషధారణలో నైపుణ్యంగలదని తెలుస్తూనేవుంది. సరైనదుస్తులు, ఆభరణాలు, పోషణవల్ల నడివయస్సుని ఆమడదూరంలో వుంచినట్లుంది లోపలి కెళ్ళాం. గదుల్లో మృగాల తల కాయలు గురించి చెప్పింది. భర్త ధైర్యసాహసాలను ప్రస్తావించింది. నెల క్రితం ఒక్కడూ ఒక సివంగిని వేటాడాట్ట. ఇరువురికీ అన్యోన్యం కుదిరి నట్టు తెలుసుకున్నాను. భర్త సాహసకృత్యాలని చెప్పడంలో ఉద్దేశం లేక పోలేదు. తన వివాహానికి పూర్వం అతను చాలా పిరికివాడట. తనొచ్చిం తర్వాత, అతను మారిపోయి, అపూర్వమైన శక్తులను తెలివిని ప్రదర్శి స్తున్నాడుట. సీతాదేవి భర్తని ఘనకార్యాలు సాధించడానికి పురికొల్పింది. ఆమె ప్రేమ ప్రేరణవల్ల అతను తన్మయుడయ్యాడు. ఆదర్శం స్పష్టంగా

లేనంతవరకూ, మానవుడు ఆ ఆదర్శంకోసం ఎన్ని త్యాగాలన్నా చెయ్య డానికి సిద్ధపడతాడుకాబోలు. ఇంతకీ ఆమె ప్రేరణవల్ల అతను సాధించ దలిచిందేమిటి? నాకు తెలీదు. తోటలోకెళ్ళాం. రెండు జింకలూ, నెమలి వున్నాయి. పంజరాల్లో వింతవింత పక్షులున్నాయి. తల్లోంచిపడిన పువ్వుని ఆమె ఒంగితీసింది. ఒంగినప్పుడుపొట్ట మడతపడింది—మడతేమిటి, రెండు మడతలు జాలేసింది. ఆదర్శం స్పష్టంగా వుండక పోవడమే మంచి దేమో. నేనెల్లాగయ్యానో! మెడమీద గీతలు కనపడసాగాయి. ఆనాటినుండి అద్దం చూసుకోడం తగ్గింది.

సీతాదేవి వివాహం జరిగి ఎంతకాలమైందో? పిల్లలా? ఆమె వయస్సు దాదాపు ముప్పై - ఇల్లా అనుకుంటూ వుండగా ఆమె మాట్లాడం సాగిం చింది. "ఎవరి ప్రయత్నమూ లేకుండా అంతా అల్లా జరిగిపోయింది. అదో చిత్రమైన గాథ"

"చెప్పండి, వినాలనుంది."

"నేనూ, మా పినతల్లి, వంటాయనా కార్లో వెడుతున్నాం. పెద నాన్నకి జబ్బంటే చూసొద్దామని బైలుదేరాం. ఆయనెక్కడో మారుమూల క్యాంప్‌లో వుండగా పక్షవాతం వచ్చిందట. పక్షవాతం అంటే నాకు భయం. మా తండ్రిగారు దానివల్లనే కాలంచేశారు. ఐదేళ్ళయింది. కారు అడవిలోంచి పోతోంది. రాత్రి తొమ్మిదైందనుకుంటా. నట్టడివిలో టైరు చెడింది. స్పేర్ టైర్ ఆ సాయంత్రమే వేశాడు. ఏమిటి చెయ్యడం? కీకారణ్యం. అరణ్యం పొద. దూరంగా ఏవో అరుపులు. మా పిన్ని ప్రాణాలుగ్గబెట్టుకుంది. ఏంచెయ్యాలో ఎవ్వరికీ తెలియడంలేదు. వంటా యన కర్రా కలపా పోగుచేసి మంటచేశాడు. మంటకి ఏ జంతువూ రాదట. ఇంక రాత్రంతా ఆ అడవిలో గడపాల్సిందే! డ్రైవరు కొంత దూరంవెళ్ళి ఎవరన్నా వుంటేపలుకుతారని కేకవేశాడు. ఇంతలో పెద్దగాలి, వర్షం. మంట కాస్తా ఆరిపోయింది. అప్పుడు భగవంతుడల్లే మూర్తిగారు ప్రత్యక్ష మయ్యాడు. గడం అదీ చూసి చీకట్లో భయపడ్డాను. తరవాత

చెప్పారు. అడవుల్లో క్యాంప్‌చేస్తూ మనుషులతో సంపర్కం తగ్గి గడ్డం చేసుకునే అలవాటు విడిచిపెట్టారు. ఈ అడవిలోనే కాంప్‌చేస్తున్నాడట. దూరంగా కేకలు వినిపించాయట. మమ్మల్నందరినీ టెంట్‌లోకి చేరేశాడు. కాసేపటికి వాన వెల్సింది. మళ్ళా మంటలు చేశారు. స్టవ్‌మీద కాసినన్ని పాలుంటే కాచిచ్చాడు. పిన్ని తాగి పడుంది. అల్లా కల్సింది స్నేహం.'

నేను మిగతాది వూహించుకోగలను. అద్భుతమైన ప్రకృతి దృశ్యం, కొండలు, లోయలు, పెద్దఅడివి – దూరంగా ఎక్కడో అడివి జుట్టులో మధ్యపాపిటలాగ చిన్నకాలువ – అడివిదేవత బలుబుచేసి చీదినట్లుగా వర్షం, చీకటికి జడుసుకొని దూరంగా వెళ్ళి మెరవని తారకలు – ఈ ప్రకృతిలో వుండి పోదాం అనుకుంటూ వుండేవాడిని కాని, నిజంగా వుండలేను. ఒకక్షణం దర్శనమిచ్చి మానవహృదయానికి గగుర్పాటు, సున్నితమైన ఆవేదన, తాత్కాలిక సౌందర్యానుభూతి కలిగించేటందుకే యీ ప్రకృతి భీభత్సదృశ్యం. "నువ్వు నాలోవాడివేస్మా" అని వొక్కసారి జ్ఞాపకంచేసే దూరపుచుట్టం ప్రకృతి – అది చచ్చిందో బ్రతికిందో ఎవరికీపట్టలేదు భయం, చీకటి, చలి, ఆకలి – శరీరానికి నిబ్బరం, వెలుగు, వెచ్చదనం, సంతృప్తి కావాలి శరీరం దగ్గరగా, యింకాదగ్గరగా జరిగింది. ఆకలి అనే జ్వాలలో ఆ శరీరాలు నిశ్శబ్దంగా పడ్డాయి. మంట చల్లారింది. తెల్లవారింది. వెలుగు, నిబ్బరం, కొత్తబలం, సంతృప్తి చెందిన శరీరపు వికాసం–ఇవన్నీ వివాహం అనే సంస్థలో అంతమొందాయి. ఆ అనుభవం రోజూ, అందరికీ ఏదో విధంగా లభ్యమయ్యేదే. కాని ఆ శరీరాలు, ఆ పరిస్థితులు, తిరిగిరావు. జ్ఞాపకంమాత్రం నిల్చిపోతుంది. చివరివరకూ అదే స్మరించుకుంటూ, అవే యివనుకుని, భ్రమతో జీవితయాత్ర సాగుతుంది.

ఆమె మళ్ళా మాట్లాడుతోంది.

"తరవాత తెల్సింది. ఆయన కాంప్‌చేస్తున్నారట. భోజనం సామగ్రి, అసిస్టెంట్లు, నౌకర్లు ఆ సాయంకాలానికి జీపులో చేర్చుకోవాలిట,

ఆ జీప్‌కూడా చెడిపోయిందట. వారెవ్వరూ రాలేదట. ఈయనొక్కరూ హడలిపోయి, ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని, ఎవరైనా మనిషి కనబడితే బాగుండునని దైవాన్ని ప్రార్థిస్తూ కూర్చున్నారుట. భగవంతుడులా మేం కనిపించామట. లేకపోతే భయంవల్ల ఆయన ప్రాణం విడిచేసి వుందురట" అని ఆమె నవ్వింది.

"ఇదంతా జరిగి ఎంతకాలమైంది ?"

"నాలుగు నెలలు"

అతనికి ముప్పైరెండు, ఆమెకి ముప్పైవొకటి – ఇంతవరకూ పెండ్లి ఎందుకు కాలేదో ? ఆదర్శాల అన్వేషణే ? ఒకాయన ఆదర్శ స్త్రీ కోసం వేచివున్నాడట. ఇరవై యేళ్ళకి దొరికిందట. తను ఆదర్శపురుషుడి కోసం అన్వేషణ సాగిస్తున్నానందట ఆమె. మధ్య నా కెందు కివన్నీ ? అడిగేటందుకు నేనెవర్ని ?

ఇంతలో అసిస్టెంటొచ్చాడు. జేమ్సు తలకి పట్టీ వేసుకున్నాడట. అక్కడికే వెళ్ళి చూడడం తప్పదన్నాడు. బైలుదేరాను. పావుగంటలో అక్కడికే వచ్చాడు మూర్తిగారు. వేలంలో పాడే అవసరం లేకుండానే కొంచెం తక్కువధరకి చర్మం నాకు లభింపచేశాడు. నేను సెలవు తీసుకుని వెడతానన్నాను.

"భోజనం చెయ్యరూ ?" అన్నాడు.

"వెడతాను, చౌదరిగారు కనిపెట్టుకొని వుంటారు నాకోసం" అన్నాను.

"ఏదేనా పుచ్చుకుని వెడుదురుగానొండి" అన్నారాయన. ఇద్దరం బంగళా కెళ్ళాం. పళ్ళు, నిమ్మరసంతో డ్రింక్ తెచ్చింది సీతాదేవి. ఏదో మాట్లాడటంకోసం అన్నాను. "ఈ ప్రాంతంలో అడివిపందులు ఎక్కువంటారా ?"

"ఎక్కువే. పెద్దపులులు లేవు ఎప్పుడేనా చిరతపులి రోడ్డుకడ్డంగా పరుగునిపుంటుంది. మీరు తీసుకెళుతున్న పులి చర్మం ఉత్తర హిందూ

స్థానంనుంచి వొచ్చినది. కల్నల్ అండర్సన్ పేరు విన్నారా? ఆయన వేటాడిన పులి చర్మంట మా కిచ్చినది. టానింగ్ పరికరాలు మంచివి రాలేదు. బాగా టాన్‌చేస్తే యీ పంపిచర్మం చాలా ఆకర్షణీయంగా వుంటుంది."

'ఉండండి" అని గదిలోకెళ్ళి బల్లమీదవున్న నాలుగైదు హంటర్లలో వొకటి తీసుకొచ్చి నాకిచ్చాడు.

"ఇది ఉంచుకోండి—జ్ఞాపకార్థం."

నేను తీసుకుని "థ్యాంక్" చేసి దాన్ని పరకాయించి చూశాను. రెండడుగులు పొడుగుంటుంది—అంత బరువూలేదు. చుట్టూ నల్లచర్మంతో కప్పివుంది. చివరలో పట్టుకునేందుకు తోలుపటకా ఒకటుంది. ఊరికే అలంకారానికీ, చేత్తో తిప్పుకునేటందుకూ ఆర్మీ ఉద్యోగుల హస్తభూషణం అది. తోలుగొళ్ళెం కాస్త చిరిగింది. చివరలో రెండుమూడు పసుపుపచ్చ డాగులున్నాయి చర్మంపైన. ఆయన లోపలికెళ్ళాడు. నేను గదిలో బల్ల దగ్గరకెళ్ళి, మిగిలిన నాలుగు హంటర్లనీ చూసి, వాటిలో డాగులూ, చిరుగులూ లేని మధ్యనున్న మంచి హంటర్ని ఏరి, నా చేతిలోది అక్కడ పెట్టేసి బైటకొచ్చాను. జ్ఞాపకార్థం తీసుకెడుతున్న బహుమతి కొంచెం కొత్తదిగా ఉండడమే మంచిదనుకున్నా. అన్ని హంటర్లూవొకటే — ఏ హంటరైతే నేం? కాని నే కొత్తగా ఏరుకున్న హంటర్ మరీ తేలికగా కనపడింది—కాస్తంత సన్నంగాకూడా వుందేమో. మరీ మంచిది. ఇంతలో మూర్తిగారు పైకం ముట్టినట్లుగా సంతకంపెట్టి రసీదిచ్చాడు. "ఈ ప్రాంతంకేసి వొచ్చినప్పుడు యిక్కడికి రాకుండా వెళ్ళకండేం?" అంది సీతాదేవి. "ఓ తప్పకుండా" అని ఉభయుల దగ్గరా శెలవుతీసుకొని వొచ్చేశాను.

ప్రయాణంలో తోవపొడుగునా — అసలు అంతకి ముందునుంచీ కూడా—ఆమె "పాపం, మురళి" అని ఎందుకన్నదా అని వితర్కించు

కుంటూనే ఉన్నా. "పాపం" ఏమిటి? అర్థంలేనిముక్క. అతన్ని గురించి ఆమె కేం తెలుసు ? "పాపం" అనగలిగేటంత తెలుసు అదేమిటి ? "పాపం" అనేది పేచీలతో కూడుకున్నమాట. దాని కెన్నో అర్థా లున్నాయి ఉచ్చరించిన విధంబట్టి, ఆ అర్థాలు మారుతూంటాయి. 'పాపాలు చెయ్యడం' అనడానికి "పాపం చెయ్యడం" అనడానికీ తేడావుంది. కొన్ని వాక్యాలు చూడండి 'పాపం పండింది' 'పాపాలు పెరిగి పోతున్నాయి' "పాపిష్టి బ్రతుకు" "పాపాలకల్లా భైరవుడు" పాపం మంచివాడు. "ఏం పాపం!" "మరే పాపం" "పాపానికి పశ్చాత్తాపం లేదు.

వీటిని గురించి ఆలోచిస్తే స్థూలంగా రెండురకాల అర్థాలు కన బడతాయి. నైతికంగా ఖండించదగిన చెడ్డపని అన్నది వొకటి. లౌకిక దృష్ట్యా సానుభూతి అన్నది రెండోది. "పాపం మంచివాడు" అనడంలో జాలి ప్రకటితమవుతుంది - లౌకికదృష్ట్యా ఆ మంచితనాన్ని కాస్త హేళన చెయ్యడమూ ఉంది. సీతాదేవి వాడిన "పాపం"లో జాలిపడటం వుంది. అతని మంచితనాన్ని కాస్తంత వెక్కిరించడమూ వుంది. మంచి వాడు స్త్రీని ఆకర్షించడేమో! మంచివాడు తనకోసం చేసిన త్యాగాన్ని స్త్రీ క్షమించదేమో! సీతాదేవి అతన్ని క్షమించింది. "పాపం మురళి" అని అప్రయత్నంగా అనేసి తన ఆధిక్యతని (నైతికంగానా?) స్థిరపరచు కుందా? అతనేం చేశాడు? అసలేం జరిగింది? ఇల్లాంటివి ఎన్నో ప్రశ్నలు ఎదురైనాయి. నా కుతూహలం రేకెత్తింది. అతన్ని గురించిన వివరాలు సేకరించాలని అన్వేషణ సాగించాను.

చదువుకునే రోజుల్లో గోపాలం, నేనూ హాస్టల్లో ఒక గదిలో వుండేవాళ్ళం. శెలవలకి యింటి కెళ్ళినప్పుడు పెద్దపెద్ద ఉత్తరాలు వ్రాసుకునేవాళ్ళం. అదృష్టవశాత్తు ఎగ్జిబిషన్‌లో అతన్ని కలుసుకోడం జరిగింది. వ్యవసాయశాఖలో పనిచేస్తున్నాట్ట వాళ్ళస్టాల్‌తో కూడా నలుగురికీ వివరించి చెప్పేటందుకు అతన్ని పంపారుట. అతనే నన్ను గుర్తుపట్టాడు. "బాలు" గురించి ఎత్తాను.

"నీ దగ్గర కాలేజీ మేగజీన్ లేదా ?" అన్నాడు.

"లేదు."

"ఎక్కడైనా దొరికితే చూడు. అందులో అతని భావ గీతాలు కూడా పడ్డాయి.

"ప్రేమ గీతాలా ?"

"ఏమో నాకేం గుర్తులేదు. సాధారణంగా ఆ వయస్సులో యువకు లందరూ వెళ్ళబోసుకునే శృంగార జాడ్యం" అన్నాడు.

"ఫ్లూట్ వాయించేవాడట."

"చెప్పుకునేవారు. నేనూ వినలేదు. ఐనా అతని గొడవ నీ కెందుకు ?"

పెద్దయింతర్వాత బాల్య స్నేహితులు ఎల్లా తయారయ్యారా అని తెలుసుకోవాలన్న కుతూహలం" అన్నాను.

"అతన్ని ఆచారి బాగా ఎరుగును" అన్నాడు.

"రంగాచారా ? ఎక్కడున్నాడు ?"

"ఈ వూళ్ళో. పవర్‌హౌస్‌లో పనిచేస్తున్నాడు. ఏడాదైంది యిక్కడికి ట్రాన్స్‌ఫరై."

నా కాశ్చర్యం వేసింది. దగ్గరకొచ్చినకొద్దీ దూరమైపోతాం అన్న ఇంగ్లీషు పద్యంలో పాదం స్ఫురణకొచ్చింది. ఆచారిని కలుసుకున్నా, అవీ యివీ మాట్లాడుకున్న తర్వాత "బాలు" విషయం అడిగాను.

"పేరు ?"

"బాలు—

"కృష్ణయ్య! "బాలు" అనడం నే నెరగను. కృష్ణయ్యగానే ఎరుగుదును. కథలు అవీ వ్రాస్తూండేవాడు. కాలేజీ మేగజీన్‌లో అతని కథ ఒకటి పడింది" అన్నాడు.

"ఆ, అతనే. ఇప్పుడేం చేస్తున్నాడు ?" అని అడిగాను.

"ఆ కథపేరు 'రంభ'"

'అతనే, ఏం చేస్తున్నాడు ?"

"రంభతో సరసాలాడుతున్నాడు" అన్నాడు.

"అదేమిటి ?"

"రెండేళ్ళక్రితం టి. బి. వచ్చి పొయ్యాడు."

నాకు విచారం వేసింది. 'పాపం మురళీ' అనుకున్నాను. టి. బి. వచ్చి చనిపోలేదు. ఏ స్త్రీనో ప్రేమించి, విఫలుడై ఆత్మహత్య చేసుకొన్నాడు—అనుకుంటే మనస్సుకి శాంతి.

నా కథ ముగిసింది. నే చెప్పినఘట్టం విని శాస్త్రి చేసినవ్యాఖ్యానం తప్పని తేలిపోయింది. అపరాధ పరిశోధక నవల చదివి, హంతకుడెవడో పాటకుడు పోల్చుకోలేకపోతాడు. తన కియ్యబడిన విషయాలను పురస్కరించుకొని ఫలానా అని నిర్ణయిస్తాడు, చివరపుట చూడగానే. అతను కాడు. మరొకడని తేలిపోతుంది. రచయిత విజయం సాధిస్తాడు. నేనూ శాస్త్రిపైన విజయం సాధించాను.

ఈ విషయం సీతాదేవికి జాబుద్వారా తెలియచేస్తే ? ఉత్తరం భర్తచూస్తే ప్రమాదం ఏమన్నావుంటుందా ? ఆలోచన తెమలక సాయంత్రం సినిమాకెళ్ళాను. విశ్రాంతి సమయంలో సోడా తాగుదామని బైటకొచ్చాను. ఎవరో భుజం చరిచారు. వెనక్కి తిరిగాను. గుర్నాథం. గుర్నాథంది బట్టతలైపోయింది. పాంటులో చొక్కా అమరికగా ఉండడం లేదు. కాసేపు ఉగ్గపెడితే తోపలి కెళ్ళినట్లుగా వున్నా, లాగూలు విసర్జించి పంచకట్టుపై పటకావేసి బిగించేసమయం వచ్చిందనుకున్నా. అతనికి నలుగురు పిల్లలుట. ప్రపంచం ఎలా కదలిపోతూంది! జీవితం ఎల్లా పెరిగిపోతూంది! ఆ శృంగారం ఆ కలలు, ఆ ఆదర్శాలు, భావగీతాలు ప్రపంచాన్ని పెంచడానికేనా? సృష్టిని ఆపడం ఎవ్వరితరం ?

'పాపం బాలకృష్ణ, టి. బి. తో చనిపొయ్యాడుటగా ? అన్నాను.

'ఎవడా అన్నదీ? చనిపోయినవాళ్ళ కుటుంబానికి ఇన్స్యూరెన్స్ డబ్బుని కంపెనీ వారిచే కక్కిస్తున్నాడు" అన్నాడు గుర్నాథం.

"అంటే"

"నాలుగేళ్ళక్రితం హైదరాబాద్‌లో కలుసుకున్నాను. ఇన్స్యూరెన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. టి. బి. తో చనిపోయింది కృష్ణయ్యచౌదర్లని

బి. ఏ. మొదలెట్టేడు. కథలు వ్రాస్తుండేవాడు. మన బాలు – బాలకృష్ణ – వాడికేం హాయిగా ఉన్నాడు."

"పెండ్లయిందా ?"

'అవకుండా వుంటుందా ? ఆ విషయం నే నడగలేదు సుమా. ఆ రోజుల్లో జొయ్‌మతిదేవిని దూరంగా ఆరాధించే భక్తులలో అతనొకడు. భావగీతాలు వ్రాసేవాడు – అంతా రవీంద్రుడు, ఊర్వశి, శాంతినికేతనం – ధోరణి. ఆమె వంగకన్యగా – అందుకు. ఆవిడకి ఫ్లూట్ అంటే యిష్టంట. ఇంటి దగ్గర పాపయ్యశాస్త్రి ఫ్లూట్ నేర్పేవాడట. మనవాడు కూడా షేక్ మీరాసాహెబ్ దగ్గర వో పావలా ఫ్లూట్ కొని ఊదేవాడు. బుస్‌బుస్‌మని చప్పుడేగాని సంగీతంలేదు. నాతో చెప్పకొని యిదయ్యే వాడులే. ఓసారేం జరిగిందో తెలుసా ?'

"చెప్పు"

పెట్టిలోంచి వో సంచీ పెల్లగించాడు. అందులోంచి వో ఎముక ముక్క చూపించాడు. నే జడుసుకున్నా. "ఇది మా అమ్మది" అన్నాడు. వాళ్ళమ్మ చనిపోయిందిట. దహనం జరిగిన మొర్నాడు అస్థికలన్నీ ఏరిం తర్వాత అందులో ఒక దాన్ని దాచేశాడుట. "ఈ ఎముకలో నే నొక భాగం – చిత్రంగా వుండదూ!" అన్నాడు.

"నాకిదంతా మార్బిడ్"

"అసహజంగావుందందూ చంపక. వో రకంగా సెంటిమెంటల్..."

"చపలుడందూచంపక" అన్నాను. ఇద్దరం నవ్వుకున్నాం.

"మరోసారి మరో తమాషా" అన్నాడు గుర్నాథం.

"చెప్పు."

"శెలవలిచ్చారు. ఇళ్ళకి పోతున్నాం. గదిలో ఎవ్వరూలేరు. పర్సు లోంచి ఓ పొడుగుపాటివెంట్రుక తీశాడు. 'ఇదెవరిదో తెలుసా?' అన్నాడు 'మీ అమ్మదా?' అన్నాను. 'కాదు జయమతిది' అన్నాడు. "నీ కెట్లా వచ్చింది?" "ఎవరతోనూ చెప్పకు. అప్పుడప్పుడు నానోట్సు ఆమె తీసు కుంటూ వుండేది. మొన్న బుక్కు తిరిగిచ్చేసింది. పుటలమధ్యలో

యిదుంది." "కావాలని పెట్టిందంటావా?" "అనుకుంటే ఎంత ఆనందం!" అన్నాడు. తీరాచేసి ఇన్సూరెన్స్ ఏజంటుగా తయారయ్యాడు.

ఇన్సూరెన్స్ వృత్తిని ఎందుకు చులకన చెయ్యాలో నాకు తెలీదు. అతను పనిచేస్తున్న ఇన్సూరెన్స్ కంపెనీ పేరు తెలుసుకొని యింటికి వచ్చేశాను. తొందరపడి సీతాదేవికి ఉత్తరం వ్రాయనందుకు సంతోషించాను. మనం చెయ్యని పనులవల్ల ప్రపంచాని కెంతటి ఉపకారం జరుగుతోందో తెలుసుకుంటే, నిరుద్యోగులు బాధతో కుమిలి హతమవరు.

ఆమొర్నాడే ఇన్సూరెన్స్ ఆర్గనైజరు సత్యనారాయణ్ణి కలుసుకుని ప్రస్తావించాను.

"ఇప్పుడాయన మా కంపెనీలో పనిచెయ్యడంలేదు. అప్పుడే ఇది వొదిలేసి నాలుగేండ్లయింది. అడవిమృగాలని పెంచుకునేవారికి – సర్కస్‌లు నడిపేవారికి – జంతువుల ఇన్సూరెన్స్ పథకాన్ని వొకదాన్ని తయారుచేశాట్ట! ఆ వ్యాసం పెద్దలని ఆకర్షించిందట. షికాగోపత్రికకూడ దాన్ని ప్రచురించిందట. వెంటనే అతనికి అటవికశాఖలో పెద్ద ఉద్యోగం లభించింది" అన్నాడు సత్యనారాయణ.

"ఇప్పుడెక్కడున్నాడు ?"

"మీ చౌదరిగారు ఇన్సూర్ చెయ్యమని పులిచర్మం తెచ్చాడు. అది ఆయనదగ్గర కొన్నదే. మీరేవెళ్ళి తెచ్చారుటగా.

నేను స్తంభించిపోయాను. నేను నమ్మను. నాటకంలో వేషం అన్నట్లు, ఇందులో ఏదోమోసం వుంది. నాకు నిదర్శనం కావాలి–అనుకుంటూ ఇంటికి వెళ్ళగానే మూర్తిగారి నౌకరు జాలయ్య ఓ చీటీ తెచ్చాడు. తీసి చూశాను.

"మీతో తీసుకెళ్ళిన హంటర్‌ని దయతో ఇతనిద్వారా పంపండి. మీకు మరో హంటర్ పంపుతున్నాను" అనుంది. జాలయ్య ఆ క్రొత్త హంటర్ చేతికిచ్చాడు. దాన్ని లోపలికి తీసికెళ్ళి పరీక్షగా చూశాను. రెండూ ఇంచుమించు ఒకటే. ఇదే ఎందుకు కావాలన్నాడు? నిదానంగా చూశాను. నాతో తెచ్చిన హంటర్‌మీద రెండు మూడు గుండ్రని గతుకులు మినహా–చాలా కొత్తగా వుంది. తేలికగా వుంది. కాస్తంత సన్నంగా

వుంది. తోలుగొళ్ళెందగ్గర చాకుతో కోసి చర్మం తొడుగు వూడదీశాను. లోపల వున్నది ఫ్లూట్. నాలుగు కంతలున్నాయి. ఆ కంతల్లో ఒక పొడుగాటి వెండ్రుక చుట్టబడివుంది. తొందరగా దాన్ని తొడుగులో వుంచేసి జిగురుతో గొళ్ళెందగ్గర అతికించి, దాన్ని జాలయ్యకిచ్చి పంపించి వేశాను.

నా సందేహం తీరింది. అతని పూర్తిపేరు వి. బాలకృష్ణమూర్తి. చదువుకునే రోజుల్లో ఆ "మూర్తి" తీసేశాడు. ఉద్యోగంలో కొచ్చిం తరువాత వి. కె. మూర్తి అని పెట్టుకొని ఆ"బాల"ని వదిలేశాడు. గడ్డం పెంచేసి ఆ వెనకటి శరీరాన్ని కప్పేశాడు. గతాన్ని విస్మరించాడు. అతని స్వప్నాలు, ఆదర్శాలు, ఆశలు గతంలో నశింపయ్యాయి. ఆమె కనుక్కో తీరుతుందన్న సంగతులను ఇతరులు ఆమెకి చెప్పేముందు, భర్త భార్యకి చెప్పెయ్యడం మంచిదని అతనికి తెలీదుపాపం!

గతాన్ని పూర్తిగావదల్లేదతను. దానిపై రోత-కోరినట్లుగా అతను తయారవలేదు. అతనికి కావల్సినవి లభ్యమవలేదు. అయితే అదే యదార్థం. అందులోనే అతని నిజస్వరూపం. ఆ జీవితానికి కట్టిపడవేసిన వెండ్రుక కావాలి. ఆ కంఠాన్ని వినే కంతలవాయిద్యం కావాలి. లభించిన దాన్ని అదిగా వూహించుకుని బాధపడి, బాధపడి, బాధలో తృప్తిపడి, తృప్తిలో అసంతృప్తిని రహస్యంగా పీకచుట్టూ వురేసుకుని - ప్రస్తుతాన్ని గతంలో పూడ్చేసి, గతాన్ని భవిష్యత్తుచితిపై పేర్చి-ఏమిటో ఈ వికృతమైన, అసహజమైన ఆలోచనలు తెలుసుకున్న సత్యం-కల్పితగాథకంటె యథార్థగాథ మహత్తరమైన ఆశ్చర్యాన్ని కలగచేస్తుందన్న నిర్వచనాన్ని ఋజువు చేస్తుందని తృప్తిపడకూడదా? ప్రస్తుతంతో సమాధానపడకూడదూ ? విపరీత వ్యాఖ్యానాలుచేసి విసిగించకుండా ముగింపు మొదట్లోనే తెలిసిపోయిన ఈ కథ ముగించకూడదూ ? ముగింపేమిటో చెప్పి వేసిన శాస్త్రి మరీ ఎక్కువ తెలిసున్న వాడవడంవల్ల అసలు రచనకే పూనుకో లేకపోతున్నాడనుకుని అట్లా చేసినందుకు అతనిపై నాకున్న కసిని ఈ కథద్వారా పాఠకుడితో పంచుకున్నా కదా అన్న తృప్తిలో నిలిపివేసాను.